క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు, శానిటేషన్ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు టౌన్ : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏలూరు వన్‌టౌన్ 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి తమ డివిజన్‌లో ప్రజల జీవన పరిస్థితులు పరిశీలించారు. పలువురు వ్యక్తులను కలిసి వారి అవసరాలపై సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం పలువురు వృద్ధులకు, శానిటేషన్ సిబ్బందికి చలిని తట్టుకునేందుకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని నాయకత్వంలో వారిని ఆదర్శంగా తీసుకుని, పేదలకు అండగా ఉంటామని కార్పొరేటర్ శ్రీదేవి తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలనీ, వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్ల కింద ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల వ్యవస్థను కాపాడాలి



ఎల్ఐసీ ఏలూరు బ్రాంచి -1 వద్ద పోస్టర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

ఏలూరు (టూటౌన్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్ఐసీ ఏజెంట్ల హక్కులను కాలరాయాలని చూస్తుందని ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏఓఐ సెంట్రల్ కమిటీ ఏలూరు బ్రాంచ్-1 అధ్యక్షులు పి.శ్రీరాంప్రసాద్ విమర్శించారు. స్థానిక బ్రాంచ్-1లో సోమవారం ఎల్ఐసీని రక్షించండి, ఏజెంట్లను కాపాడండి అంటూ పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం ఐఆర్డీపై ఒత్తిడి తీసుకువచ్చి ఎల్ఐసీ ఏజెంట్ల వ్యవస్థను తొలగించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలు కడుతున్న పాలసీలపై జీఎస్టీలను విధించి పాలసీదారులను చాలా ఇబ్బంది పెడుతున్నారన్నారు. భవిష్యత్తులో అన్ని సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి జేఎస్ఆర్ చంద్రశేఖర్, కోశాధికారి వైఎస్ కనకారావు, జోనల్ కౌన్సిల్ సభ్యులు బి.రామ్మోహనరావు, గోదావరి జగన్మోహన్ రావు, ఈసీ సభ్యులు సీహెచ్ జనార్ధన్ రావు, కె.శ్రీనివాసరావు, ఎండీ షరీఫ్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు.. వలంటీర్లు

వలంటీర్లకు వందనం

ఏలూరు టౌన్ : ప్రజలకు ఇంత గొప్పగా సేవ చేయవచ్చని నిరూపించి, దేశానికే స్ఫూర్తిగా నిలిచారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేస్తూ వలంటీర్లు సైతం తమ సేవాభావాన్ని చాటుకుని శభాష్ అనిపించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో నాలుగున్నరేళ్ల నుంచి అత్యుత్తమ స్థాయిలో సేవలు అందించిన వలంటీర్ల వ్యవస్థపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు స్పందిస్తున్నారు. ప్రజల కోసమే ఎన్నికైన ప్రభుత్వం ప్రజల బాగుకోసం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థపై కుట్రలు, నీతిమాలిన రాజకీయాలు చేస్తే సరిగ్గా బుద్ధి చెబుతామని ప్రజలు అంటున్నారు.



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

వలంటీర్లు రాజకీయాలకు అతీతం



రాష్ట్రంలో పేదలకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలను రాజకీయాలతో ముడిపెట్టడం సరైన విధానం కాదు. రాజకీయాలు వేరు.. ప్రజలకు సేవ చేయటం వేరని నాయకులు గుర్తు పెట్టుకోవాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాకు రైతు భరోసా వస్తుంది, మా ఇంట్లో వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మా వలంటీర్ భరత్ ప్రభుత్వ పరంగా మాకు ఏమి రావాలో అవి వచ్చేలా చేస్తాడు.

– మామిడి సావిత్రి, వైఎస్సార్ కాలనీ, ఏలూరు

జగనన్న పాలన బాగుంది



మాకు సీఎం జగనన్న పాలన చాలా బాగుంది. పేదలకు ఏమి కావాలో తెలుసుకుని మరీ అన్నీ అందజేస్తున్నారు. వలంటీర్లు నాలుగేళ్ల నుంచి ప్రజలకు మంచి సేవ చేస్తున్నారు. ఇప్పుడు రాజకీయంగా మాట్లాడి వారిని తప్పుబట్టటం మంచి పద్ధతి కాదు. ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక నీచమైన రాజకీయాలు చేస్తున్నారు. నాకు అమ్మఒడి వస్తుంది, పిల్లలను చదివించుకుంటున్నాను. మా వలంటీర్ జి.జ్యోతి మాతో చక్కగా కలిసిపోయి సంక్షేమ పథకాలన్ని అందేలా చేస్తోంది.

– మహమ్మద్ వాజిదా, 13వ డివిజన్, ఏలూరు

ప్రాణాలకు తెగించి సేవ చేశారు



దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థను సీఎం జగనన్న తీసుకువచ్చారు. ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలో నేర్పించారు. మాకు అమ్మఒడి, డ్వాక్రా రుణమాఫీ, ఇంటి స్థలం వచ్చింది. కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారు. మా వలంటీర్ శారద మాకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని పథకాలు అందేలా చేస్తుంది. ఇవన్నీ మర్చిపోయి మహిళలను అమ్ముకునే మాఫియాతో వలంటీర్లను పోల్చి మాట్లాడడం బాధాకరం.

– డీ.నాగమణి, ఏఏఎస్ కాలనీ, ఏలూరు

అవినీతి లేని పాలన



సీఎం వైఎస్ జగన్ పరిపాలనను దేశమంతా మెచ్చుకుంటున్నారు. గతంలో వృద్ధులకు పింఛన్ కావాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూర్చున్నా మళ్లీ రేపు రమ్మని చెప్పేవారు. పింఛన్ సొమ్ములోనూ నాయకులు వాటాలు అడిగే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ రావటంతో తెల్లవారగానే మా వలంటీర్ బి.మహేశ్వరి ఇంటికి వచ్చి పింఛన్ రూ.2,750 చేతిలో పెట్టి వెళుతుంది. ప్రభుత్వ పథకాలు ఏదైనా రావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తుంది. ఇలాంటి పద్ధతి దేశంలో ఎక్కడైనా ఉందా? వలంటీర్లపై నోరు జారితే ప్రజలే బుద్ధి చెబుతారు.

– చేపల ప్రసాద్, తూర్పువీధి, ఏలూరు

మర్రిగూడెం ఆదివాసులకు పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్) : టి.నర్సాపురం మండలంలోని మర్రిగూడెం పరిధిలో ఆరు గ్రామాలలో సుమారు 90 ఎకరాల భూమిని 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా నేటికీ పట్టాలు మంజూరు చేయకపోవడం బాధాకరమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓ సత్యనారాయణ మూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ బండివారిగూడెం గ్రామ ఎస్టేట్‌కు సంబంధించి 2014 వరకూ గిరిజనుల భూముల్లో ఎటువంటి ఆటంకాలు ఎదురుకాలేదన్నారు. గిరిజనులకు స్వాధీన పర్చిన భూముల్లో 2017 నుంచి తిరిగి క్రయ విక్రయాలు, బదిలీ చేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో అలజడి ప్రారంభమైందని దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించి భూములపై ఆదివాసీలకు పూర్తిస్థాయి హక్కులను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విమలక్క కోరారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకర్ వీరాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.భాస్కర్, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్దకు ర్యాలీ నిర్వహిస్తున్న విమలక్క, రైతు కూలీ సంఘం నాయకులు, కార్యకర్తలు

గొప్ప సాహితీవేత్త గుర్రం జాషువా

ఏలూరు (టూటౌన్) : స్థానిక నరసింహారావుపేటలోని ఎస్సీఆర్‌పీఎస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయం వద్ద డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన సాహితీవేత్త, విశ్వకవి గుర్రం జాషువా 51వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఆనాటి పరిస్థితులను అర్థంచేసుకుని సమాజంలో కుల వ్యవస్థపై తన సాహిత్యంతో తిరుగుబాటు చేసి, మూఢాచారాలపై చైతన్య సదస్సులు నిర్వహించారని గుర్తు చేశారు. క్రైస్తవ కుటుంబంలో జన్మించి క్రైస్తవంలో ఉన్న పొరపాట్లను ప్రశ్నించి 1958లో క్రైస్తవ చరిత్ర పుస్తకాన్ని రచించిన గొప్ప సాహితీవేత్త జాషువా అని గుర్తు చేశారు. కార్యక్రమంలో కనికెళ్ళ రవిప్రసాద్, కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయం వద్ద విశ్వకవి జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు మాట్లాడుతూ ఆధునిక తెలుగు కవులలో సుస్థిర స్థానం సంపాదించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. జాషువా ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ జాకబ్, ఎం.నాగరాజు, చొదిమెల్ల వీరయ్య, కె.గురవయ్య, అబ్రహం, వేణు, రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ,ఎస్టీ బహుజన రైట్స్ కార్యాలయంలో గుర్రం జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

జయశ్రీ రాఘవ్‌కు కోడి రామకృష్ణ సేవారత్న అవార్డు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : శతాధిక చిత్ర దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా వాసవి ఫిల్మ్ అవార్డ్స్ సంస్థ సారథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గత ఆదివారం కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించి వారికి పలు పురస్కారాలు ప్రదానం చేశారు. దీనిలో భాగంగా నగరానికి చెందిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ మహిళా అధ్యక్షురాలు కొరిపల్లి జయశ్రీ రాఘవ్‌కు కోడిరామకృష్ణ సేవా రత్న అవార్డు లభించింది. ఆర్య వైశ్య మహా సభ ద్వారా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డును అందజేశారని ఆమె సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నటుడు సుమన్, కోడి రామకృష్ణ కుమార్తె కోడి దివ్య, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, ప్రముఖ నటులు మురళీమోహన్, బాబూమోహన్, సీనియర్ నటిమణులు రోజా రమణి, కవిత, దివ్యవాణి, దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు ప్రముఖ వ్యాపారవేత్త బండారు సుబ్బారావు, మద్దుల ప్రకాష్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు.



జయశ్రీ రాఘవ్‌కు సేవా రత్న అవార్డు ప్రదానం చేస్తున్న సినీ రంగ ప్రముఖులు

ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలి

ఏలూరు (టూటౌన్) : గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. గత రెండున్నరేళ్లుగా ఆర్థిక సంఘం నిధులు వచ్చినా పంచాయతీలకు జమ కాకపోవడంతో మేము ఏ విధమైన పనులు చేయలేక కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామంటూ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు సంబంధించి 15 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద సర్పంచ్‌ల ఛాంబర్ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా చూసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని, వారికి ఏ కష్టం కలుగకుండా చూసుకోవాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు హితవు పలికారు. ఏలూరు పీఠాధిపతిగా జయరావు బాధ్యతలు స్వీకరించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్, కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల కరస్పాండెంట్ కలతోటి హెన్రీ డోమినిక్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గ్జేవియర్ నగర్‌లోని బిషప్ హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు జయరావు చీరలు పంపిణీ చేశారు. అనంతరం బిషప హౌస్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, సెయింట్‌జాన్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.బాల, ఛాన్సలర్ బాబు జార్జ్, అమలోద్భవి చర్చ్ ఫాదర్ మైఖేల్ ఇంజమూల, ఫాదర్ ఆంటోనీ, ఫాదర్ లూర్దు, గురువులు అబ్రహం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు

పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలి

ఏలూరు (టూటౌన్) : రైతు, కౌలు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, కౌలురైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ కోరారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలియజేశారు. రైతులు, కౌలుదార్లకు రూ.10 వేల పంట సాయం అందించాలని కోరారు. కటాఫ్ తేదీతో నిమిత్తం లేకుండా కౌలుకార్డులు ఉన్నవారందరికీ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలన్నారు. రూ. 2 లక్షల వరకూ పంట రుణాలు మాఫీ చేయాలని, రైతు రుణవిమోచన చట్టం తేవాలని వారు కోరారు.

నేడు మణిపూర్ బాధితులకు సంఘీభావంగా నిరసన

ఏలూరు (టూటౌన్) : మణిపూర్ హింసాకాండ బాధితులకు సంఘీభావం తెలుపుతూ సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మణిపూర్ అల్లర్లను నియంత్రించడం, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మణిపూర్‌లో ఇంతటి ఘోరాలు జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోదీ నోరు మెదపకపోవడం శోచనీయం అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ఏలూరు జిల్లాలోని అన్ని పట్టణ, మండల, నియోజకవర్గ కార్యదర్శులు, సీపీఐ శ్రేణులతో పాటు, అనుబంధ ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా కృష్ణ చైతన్య పిలుపు నిచ్చారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	100	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	34	కంద	40
పచ్చిమిర్చి	76	బీట్‌రూట్	40
కాకర కాయలు	36	కీరా దోస	28
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	188-270
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40	పాలకూర	12
దొండకాయలు	16	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	24	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-30	బఠాణీ	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	30

● తడిసిన నగరం



ఏలూరు నగరంలో కురిసిన వర్షానికి ఇబ్బందులు పడ్డ ప్రజలు

ఏలూరు నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నగరమంతా తడిసి ముద్దయింది. వర్షంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం కాలేజీ, ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వారు తడిసి ముద్దయ్యారు. నగరంలోని పలు రోడ్లు మునిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

నేడు చాటపర్రులో జగనన్న సురక్ష

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం చాటపర్రులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. సర్పంచ్ గుడిపూడి రఘు అధ్యక్షతన స్థానిక కమ్యూనిటీ హాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షులు పెన్మత్స శ్రీనివాసరాజు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అర్జీదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

కష్టపడి చదివితేనే ఫలితం

చింతలపూడి : బడి బయట ఉన్న పిల్లలను నూరు శాతం బడిలో చేర్పించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి శ్యామ్ సుందర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో జరిగిన విద్యార్థుల అసెంబ్లీకి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితే తప్పక విజయం వరిస్తుందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన చేయాలని సూచించారు. పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పూరేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో విద్యారంగం



విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలతో రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ అన్నారు. విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన్ను వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య వారధిగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్, జిల్లా అధ్యక్షుడు పి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహనరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సీహెచ్ అనిల్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జీజేపీ స్టీవెన్, జిల్లా నాయకులు తోట రాబర్ట్, తోట ఎడ్వర్డ్ తదితరులున్నారు.